# ఎదురుచూడని క్షణాలు



నందం రామారావు

సారథి అతన్తోపాటు మరో నలుగురు పట్నం నుంచి వచ్చే బస్సు కోసం ఎదురుచూస్తూ నుంచున్నారు.

ఎండ చురుగ్గా వుంది. గాలి వెచ్చగా వుంది.

రెండు గంటలు పైగా ఎదురుచూసినా బస్సు రాలేదు!

ఎండ తీవ్రత తగ్గి క్రమక్రమంగా చల్లబడసాగింది వాతావరణం.

"ఇంక ఈ పూటకి బస్సు రాదేమో! వెళ్ళిపోదాం పదండ్రా!!!" అన్నాడు సోమయ్య.

"అవున్రా! వెళ్ళిపోదాం! నుంచున్నుంచని కాళ్ళు నొప్పిగా వున్నాయి. ఒకవేళ వస్తే ఆమె

వస్తుందేమో!" అన్నాడు చింతాలయ్య.

"తప్పురా. అలా వెళ్ళకూడదు. మనం బస్సు దగ్గర వుంటామని ఆ అమ్మాయికి మాటిచ్చాం. తీరా. మనం వెళ్ళిపోయిన తర్వాత ఆ అమ్మాయి వస్తే చాలా ఇబ్బంది పడుతుంది. చీకటి పడేదాకా చూద్దాం! రాకపోతే అప్పుడే ఆలోచిద్దాం!" అన్నాడు సారథి.

సారథి మాటకు ఎవరూ ఎదురు సమాధానం చెప్పకుండా రాబోయే బస్సు కోసం ఎదురుచూడసాగారు.

అందమైన ఆడపిల్ల ఏం చేసినా అందంగానే వుంటుంది.

మనసున్న మగవాడు ఏం చేసినా అందంగానే వుంటుంది.

సారథి వయస్సు పాతిక సంవత్సరాలు.

వయస్సులో వున్నాడు గనుక అందంగా వుండాలన్న రూలేం లేదు! అతను టెన్త్ పాసై ఆ తర్వాత చదివే స్తోమత లేక గూడెంలోనే వుంటూ వున్న ఎకరం పొలం చూసుకుంటూ అందరికీ సహాయపడుతున్నాడు.

సారథి ఆ గూడెంలో వున్న యువకుల్ని చేరదీసి దసరా ఉత్సవాలకు సాంఘిక నాటకం ఒకటి ప్రదర్శించడానికి పూనుకున్నాడు.

దాని ఫలితమే బస్సు కోసం నిరీక్షణ!

ఆ నాటకంలో హీరోయిన్ వేషం వేసే 'శాంతిశ్రీ' పట్నం నుంచి రావాలి. ఆ రాత్రికి నాటకం రిహార్సల్స్ చేసి ప్రొద్దుటే ఆ అమ్మాయిని పంపించేయాలి. మరో వారం రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

అప్పటికి పూర్తిగా చీకటి పడలేదుగానీ, పశ్చిమ దిశలో వున్న సూర్యుడు అలసటగా వున్నాడు. ఏ క్షణంలోనైనా విశ్రాంతి తీసుకోవడానికి మబ్బులచాటుకి వెళ్ళిపోవచ్చు.

ఎదురుచూస్తున్న బస్సు రానే వచ్చింది.

వస్తుందనుకున్న 'శాంతిశ్రీ' ఆ బస్సులో రానే వచ్చింది.

బస్సు దిగటంతోనే సారథిని చూసి "సారీ అండీ! బస్సు లేటయ్యింది. అనుకున్న టైమ్‌కు రాకపోయేసరికి మీరు వెళ్ళిపోతారేమోనని భయపడ్డాను" అంది.

"బస్సు లేటయిందానికి మనమేం చేస్తాం. రండి, మా గూడెం వెళ్ళాలంటే రెండు మైళ్ళు నడవక తప్పదు" అన్నాడు సారథి.

"అదేమిటి ఎడ్లబండి కూడా వెళ్ళదా?" అనడిగింది.

"వెళ్ళదండి. దారంతా ఇసుక, డొంక, దానికి తోడు ఒక వంతెన దాటాలి. వంతెన మీద నుంచి బండి వెళ్ళదు. మనుషులు నడిచి వెళ్ళడానికి మాత్రమే ఆ వంతెన పనికొస్తుంది. వంతెన కింద నుంచి బళ్ళు వెళ్ళవు.

"అదేం?"

"అదంతేనండీ! పదడుగుల లోతు నీళ్ళుంటాయి."

వాళ్ళంతా ఏవేవో మాట్లాడుకుంటూ నడవసాగారు.

నాలుగు ఫర్లాంగులు వచ్చేసరికి ఇళ్ళు కనిపిస్తుంటే వుండబట్టలేక అడిగింది శాంతిశ్రీ "ఆ కనిపించేదేనా మీ వూరు?"

"ఆ కనిపించేది మా వూరు పంచాయితీ కప్పాపురం. ఆ వూరులోంచి మరో మైలు వెడితే మా గూడెం వస్తుంది".

"చుట్టూ వున్న పంటపొలాలను చూసుకుంటూ శాంతిశ్రీ హుషారుగా నడవసాగింది. చల్లని గాలి హాయిగా వీస్తోంది. ఏవేవో పక్షులు అరుచుకుంటూ వెడుతున్నాయి.

"మీకు తెలుసునో లేదో! మా వూరికి కరెంటు లేదు. రేపు నాటకం ఆడినా పెట్రోమాక్స్ లైట్ల వెలుగులోనే ఆడాలి" అన్నాడు సారథి.

"అలాగా" అంది ఆమె.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది. కప్పలు అరుస్తున్నాయి. కీచురాళ్ళు అరుస్తున్నాయి. ఏదో పేరు తెలీని పిట్ట మహా వికృతంగా అరుచుకుంటూ పోతోంది. దీపాలు లేకపోవడంవల్ల ఆ ప్రాంతాన్నంతా ఎవరో రాక్షసుడు పాలిస్తున్న ద్వీపంలా వుంది.

అప్పటివరకూ ఎంతో సరదాగా వున్న శాంతిశ్రీకి ఏదో భయంలాంటిది కలిగింది.

బిక్కుబిక్కుమంటూ నడక సాగింది.

కప్పాపురం దాటి డొంక వెంట నడవసాగారు.

తెలియని ఈ ప్రాంతానికి ఎందుకొచ్చానా అని శాంతిశ్రీ భయపడసాగింది.

వంతెన దగ్గరకొచ్చారు.

శాంతిశ్రీ తలెత్తి చూసింది.

మసక వెన్నెల కురుస్తోంది.

కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఎగువ నుంచి పల్లంలోకి నీరు ప్రవహించడం వల్ల ఒక మహా ప్రళయం సంభవిస్తున్నట్లుగా వుంది నీటి శబ్దం. దాదాపు పది గజాల వెడల్పుండి ఒక రాక్షసుడు చాచిన నాలుకలా వుంది కాలువ.

ఆ కాలువను చూడ్డంతోనే శాంతిశ్రీ వణికిపోయింది. నోట మాట రాక అలాగే నిలబడిపోయింది.

"రండి! ఈ వంతెన దాటితే మా గూడెం వచ్చినట్లే" అంటూ సారథి గట్టు ఎక్కాడు.

ఆ గట్టు చాలా ఎత్తుగా వుంది.

శాంతిశ్రీ నెమ్మదిగా గట్టు ఎక్కింది.

పెద్ద పెద్ద దుంగలు పాతి దాని మీద నడవడానికి తాటి పట్టాలు వేసి వున్నాయి. కింద పదడుగుల లోతున నీరు మహా వేగంగా ప్రవహిస్తోంది. "వంతెనంటే ఇదా?" అంది శాంతిశ్రీ ఆశ్చర్యంగా.

"అవునండి. దీన్నే మేము వంతెన అంటాం".

"అమ్మ బాబో! ఈ వంతెన మీద నేను ఛస్తే



నడవను. ఏవండీ! ఎందుకొచ్చిన నాటకాలుగానీ నా దారిన నన్ను పోనివ్వండి. చూశారా నీరు ఎంత లోతుగా వుందో!"

"మీకేం భయం లేదండి. మీ ప్రాణానికి మా ప్రాణాలు అడ్డేస్తాం. మీరు నెమ్మదిగా నడవండి చాలు!"

శాంతిశ్రీ ఆ తాటిపట్టాల మీద ప్రాణాలు బిగపెట్టి నెమ్మదిగా నడవసాగింది. కాళ్ళు వణుకుతున్నాయి. గుండె దడదడలాడుతోంది.

తన చావు ఇక్కడే రాసిపెట్టి వున్నట్లుగా భయపడసాగింది. నడవలేకపోతోంది. బాలెన్స్ తప్పుతున్నట్లుగా అనిపించి భయంగా "సారథిగారూ!" అంది.

ముందు నడుస్తున్న సారథి శాంతిశ్రీ పిలుపుకు ఆగి "ఏమిటండీ?" అన్నాడు.

"నేను వెనుదిరిగి వెళ్ళిపోతాను. మీరు మరోలా భావించకండి" అంది.

వెంటనే సారథి ఆమె చేతిని పుచ్చుకుని "మీకేం భయంలేదు. నేనున్నాను. నా చేతిని పట్టుకుని నెమ్మదిగా నడవండి" అన్నాడు.

శాంతిశ్రీ గభాల్న సారథి చేతిని పట్టుకుని కిందకి చూసింది.

కాలువ నీరు వింతశబ్దం చేస్తూ పారుతోంది. "ఇంతకుముందు ఈ కాలువలో పడి ఎవరైనా చనిపోయారా?" అప్రయత్నంగా అడిగింది శాంతిశ్రీ.

"నలుగురైదుగురు చనిపోయారు. ఈ తాటిపట్టాల మీద నడుస్తూ వళ్ళు తూలి కళ్ళు తిరిగి పడిపోయినవారు చాలామంది వున్నారు. సాధారణంగా పల్లెటూళ్ళో వారికి ఈత వచ్చు గనుక ఎలాగో బయటపడుతూ వుంటారు" అన్నాడు సారథి.

"మీరింతమంది యువకులుండి సిమెంటుతో వంతెన కట్టించలేకపోయారంటే ఆశ్చర్యంగా వుంది".


"నిజమే! మేమింతమంది వుండి కూడా ఏం చేయలేకపోయాం. మాకే సిగ్గుగా వుంది. వంతెన కోసం మా ప్రయత్నాలు చేశాం. కలిసిరాలేదు. ఇదిగో వంతెన దిగుతున్నాం గదా ... జాగ్రత్తగా దిగండి".

ఎలాగైతేనేం అందరూ వంతెన దిగారు.

ఆ రాత్రి అందరూ నాటకం రిహార్సల్లో పడిపోయారు.

## కరీనా? రాణి?

ఉదయ్ కిరణ్‌తో ఏం.ఎమ్. రత్నం నిర్మిస్తోన్న ప్రేమంటే సులువు కాదురా... చిత్రంలో రాణీ ముఖర్జీని నటింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలుగు, తమిళంలో రూపొందిస్తున్న ఈ చిత్రంలో పేరున్న బాలీవుడ్ హీరోయిన్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆయన ఎస్.జె సూర్య ద్వారా కరీనా కపూర్‌కు సందేశం పంపారని తెలిసింది. అయితే కరీనా దక్షిణాది చిత్రాలపై ఆసక్తి చూపడం లేదు. దీనితో ఆయన రాణీముఖర్జీని సంప్రదిస్తున్నారని సమాచారం. ఇంద్రలో అశ్వనీదత్ చిరంజీవి సరసన రాణిని నటింపచెయ్యాలని ప్రయత్నించి విఫలమయ్యారు. మణిరత్నం కూడా సఖి చిత్రం కోసం ప్రయత్నించారు. ఇప్పుడైనా రాణీ అంగీకరిస్తుందో లేదో చూడాలి.



* * *

అర్ధరాత్రి టైమెంతయిందో తెలియదుగానీ అంతా నిశ్శబ్దంగా వుంది. బయట నులకమంచం మీద పడుకున్న సారథి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. కళ్ళు తెరిచి ఆకాశంకేసి చూస్తుండిపోయాడు.

ఆకాశంలో నక్షత్రాలు మనం సాధించిన ప్రగతికి చిహ్నాల్లా మెరుస్తున్నాయి!

ఒక నక్షత్రం మాత్రం సారథి కంటికి మరీ ప్రత్యేకంగా కనిపించసాగింది.

ఆ నక్షత్రంలో తనూహించుకుంటున్నవి ఎన్నో కనిపిస్తున్నాయి. ఎక్కడ నుంచో నల్లని మబ్బు తునకొకటి వచ్చి ఆ నక్షత్రాన్ని కప్పేసింది. ఆ మబ్బుతునక వున్నట్లుండి పంచాయితీ ప్రెసిడెంటు పార్వతీశంగా మారి వికృతంగా నవ్వుతున్నట్లుగా వుంది. వెంటనే సారథి కళ్ళు మూసుకున్నాడు. అతని కళ్ళ ముందు గతంలో జరిగిన సంఘటనొకటి కదలాడసాగింది!

* * *

గదిలో కూర్చొని పేపరు చదువుకుంటున్న పార్వతీశం ఎవరో వచ్చినట్లనిపించి తలెత్తి చూశాడు.

ఆయనకెదురుగా సారథి.

"నమస్కారమండీ! నా పేరు సారథి..."

"తెలుసు. గూడెంలో వుంటున్నావు. ఏమిటిలా వచ్చావ్?"

"కాలువకు వంతెన లేకపోవడంవల్ల గూడెంలో వున్నవాళ్ళమంతా చాలా ఇబ్బందులు పడుతున్నాం. దయచేసి వంతెన నిర్మించే ప్రయత్నం చేయండి. మా వంతు సహాయం అందరం కలిసి చేస్తాం".

"చూడు సారథీ! నీ ఆశయం మంచిదే. ఈ గ్రామానికి పెద్దగా నాకూ చాలా పన్లు గొప్పగా చెయ్యాలనుంటుంది. ఆచరణలో సాధ్యంకాదు. అయినా ఇప్పుడు మీకేం ఇబ్బంది వచ్చిందని? ఎంచక్కా దుంగలు పాతించి తాటి పట్టీలు వేయించాను. మీరు నడవడానికి బాగానే వుంది గదా!!!"

"దానిమీద నడవడం ఎంత కష్టమో మీరోసారి వచ్చి చూసి నడవండి. మీకే తెలుస్తుంది. నిన్నగాక మొన్న రావులమ్మ తాటిపట్టీలమీద నడుస్తూ నీటిలో పడిపోయి ప్రాణాలు విడిచింది. అంతక్రితం పదేళ్ళ దాసు నడుస్తూనే పడిపోయి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మా కష్టాలను గమనించి మీరు ఆదుకోవాలి" దాదాపు ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాడు సారథి.

"చూడు సారథీ! మీ గూడెంలో నువ్వేదో చదువుకున్నవాడినని, పెద్దగా వెలిగిపోదామని చూస్తున్నావేమోగాని ఈ ఊరి బాగోగులు నాకు పూర్తిగా తెలుసు. ఎప్పుడు ఏం చేయాలో యింకా

తెలుసు. ఇంక మాట్లాడకుండా నువ్వెళ్ళు"

"మా కష్టాలను మీక్కాకపోతే ఇంకెవరికి చెప్పుకోం?"

"ఎవరికీ చెప్పుకోనక్కరలేదు. ముందిక్కడ మంచి వెళ్ళు."

"వంతెన కట్టిస్తానని చెప్పి ఐదు లక్షలు శాంక్షన్ చేయించుకొచ్చి వంతెన కట్టకుండానే కట్టినట్లుగా చూపించి, ఆ డబ్బు మీరు, ఇంజనీరు తిన్న సంగతి నాకు తెలియదనుకోకండి!!!"

"ఇంకేం అన్నీ తెలుసుకున్నావుగా! పెద్దవాళ్ళం అనేక విధాలుగా చేస్తూవుంటాం! మీకు మాట్లాడే హక్కు, ప్రశ్నించే అధికారం లేదు. మర్యాదగా ఇక్కడ్నుంచి వెళ్ళు. నా ప్రతి చర్యకూ అడ్డొచ్చావా? ... నా సంగతి నీకు తెలుసు. ప్రవాహంలో కొట్టుకుపోతావ్ .. వెళ్ళు వెళ్ళి నీ పనులేమిటో చూసుకో ..." అన్నాడు పార్వతీశం.

ఆ తర్వాత సారథి ఎన్ని విధాలుగా ప్రయత్నించినా వంతెన కట్టించడం కుదరలేదు. పార్వతీశంకు ఎలా బుద్ధి చెప్పాలో కూడా తెలీలేదు! గాంధీజీ కలలుగన్న జీవితం పల్లెటూళ్ళో వుందని అనుకుంటారు. కానీ ఈ పల్లెటూళ్ళో ఎన్ని రాజకీయాలున్నాయో ఎంతమందికి తెలుసు? హింసతో అన్ని పనులూ సాధించలేం. ఒకవేళ సాధించినా, ఎన్ని హింసలని చేసుకుంటూ పోతాం? మానసిక పరివర్తనతోనే ఏదైనా సాధించగలగాలి. ఆ మానసిక పరివర్తనే మనిషికి శాశ్వత కనువిప్పు!

అదే పార్వతీశంకు జరగాలి. ఎలా? ఎలా? పడుకున్న సారథి పక్కమీద అటూ యిటూ కదిలాడు. ఆకాశంలో తారలు చూడముచ్చటగా గుసగుసలాడుకుంటున్నాయి. సడిలేని ఆ రాత్రిలో అస్పష్టమైన భావం సారథి మనసులో కదిలింది. ఆ భావానికి రూపం యిస్తే ఎలా వుంటుంది? సారథి ఆలోచనలతో ఆ రాత్రంతా అలాగే గడిపాడు.

* * *

దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఆ రోజే గూడెంలో సాంఘిక నాటకం ప్రదర్శన.

చిన్నా, పెద్ద అందరూ ఉత్సాహంగా వున్నారు.

పెట్రోమాక్స్ లైట్లు, స్టేజి అలంకరణ, హీరోయిన్ మేకప్ సినిమా పాటలు ... నాటకం ఇంకా మొదలుపెట్టకముందే మహా సందడిగా వుంది ఆ గూడెం.

ఒక్కొక్కరే నాటకం చూడ్డానికొస్తున్నారు.

కప్పాపురం నుంచి కూడా జనం ఎక్కువగానే వస్తున్నారు.

అప్పటికి రాత్రి ఎనిమిది గంటలు దాటింది.

ఏదో పనిమీద వెళ్ళి తిరిగి గూడెంకు వస్తున్నాడు సారథి.

"సారథన్నయ్యా!" అన్న కేక వినిపించడంతో సారథి ఆగాడు.

ఆ మసక వెన్నెల్లో ఎవరైందీ తెలీటం లేదు.

"ఎవరూ?" అన్నాడు సారథి.

"నేనేనన్నయ్యా, కృష్ణుడ్ని"

"నువ్వా ఏంటీ?"

"నాటకం చూడ్డానికొస్తున్నానన్నయ్యా! అవునూ ... నాటకంలో నువ్వు వేషం వేయడం లేదా?"

"వేస్తున్నానుగానీ ఒక్కడివే వస్తున్నావేమిటి?"

"పాలేరు రంగడు వెనకాల వస్తున్నాడు. నిన్ను చూసి గబగబా వస్తున్నాను".

"అలాగా! పోదాం పద!" అంటూ సారథి ముందుకు నడిచాడు.

కృష్ణుడు, సారథి చేతిని పుచ్చుకుని నడవసాగాడు.

కృష్ణుడికి పన్నెండేళ్ళుంటాయి. హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు.

ఎర్రగా, బొద్దుగా, చలాకీగా వుంటాడు.

సారథి అంటే వాడికెందుకో మహా యిష్టం.

కృష్ణుడు, ప్రెసిడెంటు పార్వతీశంకు ఒక్కగానొక్క కొడుకు.

వంతెన దగ్గరకొచ్చేసరికి అక్కడ నలుగురైదుగురు నాటకం గురించే మాట్లాడుకుంటున్నారు.

రెండు రోజులుగా కురిసిన వర్షానికి కాలువ నిండుగా వుంది. ప్రవాహవేగం ఉధృతంగా వుంది. తాటిపట్టీలమీద అందరూ జాగ్రత్తగా నడుస్తున్నారు.

ముందు ఎవరో నడుస్తున్నారు. ఆ తర్వాత కృష్ణుడు నడుస్తున్నాడు. కృష్ణుడు వెనకాల సారథి నడుస్తున్నాడు. సారథి వెనకాల ఇంకెవరెవరో నడుస్తున్నారు. అందరూ ఏవేవో మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ నడుస్తున్నారు.

ఆకాశం నిర్మలంగా వుంది ...

గాలి స్థంభించి వుంది.

నీటి ప్రవాహపు శబ్దం మాత్రం ఆ రాత్రి సమయంలో శృతితప్పిన వాయిద్యంలా వినిపిస్తోంది.


వున్నట్టుండి, నడుస్తున్న కృష్ణుడు పట్టుతప్పి పెద్ద ఆర్తనాదం చేస్తూ నీటిలో పడిపోయాడు!

ఏం జరిగిందో, ఏవిటో అని అక్కడున్న వారందరూ తెలుసుకునే లోపల సారథి ఒక్క ఊపుతో కాలువలోకి దూకేశాడు కృష్ణుడ్ని రక్షించడానికి.

ఇంతలో విషయం తెలుసుకున్న గూడెం జనం పెట్రోమాక్స్ లైట్లతో ఆందోళనగా కాలువ దగ్గరకు చేరారు.

తన కొడుకు కాలువలో పడిపోయాడనీ, సారథి, కృష్ణుడ్ని రక్షించడానికి దూకాడని తెలుసుకున్న పార్వతీశం ఆదుర్దాగా, ఆందోళనగా. పరుగెత్తుకుంటూ కాలువ దగ్గరకొచ్చాడు.

అప్పటికే అంతా అయిపోయింది!





## స్లో అండ్ స్టడీ

ఎక్స్‌పోజింగ్‌కు అస్సలు వెనుకాడని కిమ్‌శర్మకు అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మోహబ్బతే తరువాత కిమ్ నటించిన చిత్రాలు చెప్పుకోదగిన రీతిలో హిట్ కాలేదు. అందువల్ల తనకేమీ నష్టం లేదంటోంది కిమ్. ప్రస్తుతం ఈ భామ తాజ్‌మహల్, నెహలేపే దెహలా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఇంకా కొన్ని సినిమాలలో బుక్ అయింది. ఇలా వెనుకబడటం వల్ల వచ్చిన ప్రమాదం ఏమీ లేదని, తాను స్లో అండ్ స్టడీ పాలసీని నమ్ముతానని చెబుతోంది. అవకాశాలు రాని హీరోయిన్లు చెప్పే మాటలే కిమ్‌శర్మ కూడా చిలకపలుకులుగా పల్లిస్తోంది.

ఎంత వెదికినా కృష్ణుడు కనిపించలేదు.

నీటి ప్రవాహం కృష్ణుడ్ని ఎక్కడికో లాక్కెళ్ళిపోయింది.

* * *

ఇది జరిగి సంవత్సరం దాటింది.

కప్పాపురంలో అనుకోని మార్పులు చాలా జరిగాయి.

ఊళ్ళోనుంచి బస్సు వరకూ కంకరరోడ్డు పడింది.

కరెంటు స్తంభాలు పాతారు. మరో పది రోజుల్లో కప్పాపురంకు, గూడెంకు కరెంటు వస్తుంది. కాలువకు పక్క వంతెన నిర్మించారు. ఇప్పుడా వంతెనమీద ఎడ్లబండ్లు కూడా వెడతాయి. అయితే యింకా ఆ వంతెనకు ప్రారంభోత్సవం జరగలేదు.

గ్రామంలో జరిగిన అభివృద్ధికి అంతా సంతోషిస్తున్నా, సారథి మాత్రం ఏం పట్టించుకోకుండా నిర్లిప్తంగా వుంటున్నాడు. ఎప్పుడూ సంతోషంగా వుంటూ ఎదుటివారి సుఖాన్ని కోరే సారథి ఇలా ఎందుకుంటున్నాడో అర్థంకాక తలో విధంగా అనుకోసాగారు.

* * *

ఆ రోజే వంతెనకు ప్రారంభోత్సవం.

ఊళ్ళో పచ్చని తోరణాలు కట్టి రంగురంగుల కాయితాలు అంటించి ఒక గొప్ప పండుగలా, వైభవంగా ప్రారంభోత్సవాన్ని చేస్తున్నారు.

రాష్ట్రమంత్రి ఒకరు వంతెనకు ప్రారంభోత్సవం చేయనున్నారు.

అందరూ ఎవరి పనుల్లో వారున్నారు.

సారథి ఇంటిదగ్గర నుంచి బయలుదేరి సరాసరి పార్వతీశం ఇంటికెళ్ళాడు.

పార్వతీశం, సారథిని చూడ్డంతోనే మనస్ఫూర్తిగా లోపలికి ఆహ్వానించారు. ఒక్కగానొక్క కొడుకు చనిపోయాడన్న దుఃఖం పార్వతీశంను కృంగదీస్తున్నా, కొడుకు చనిపోవడంతో ఆయనలో ఎవరూ ఊహించని పరివర్తన కలిగింది.

దాని ఫలితమే ఊరు బాగుపడింది.

చనిపోయిన తన కుమారుడు కృష్ణుడు కోసం సారథి ఎలా పరితపించిందీ పార్వతీశంకు తెలుసు.

"పార్వతీశంగారూ! మీతో మాట్లాడాలి. నాకు అవకాశం ఇస్తారా?" అన్నాడు సారథి.

సారథి మాటకు పార్వతీశం ఆశ్చర్యపోయి అతన్ని మరో గదిలోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు.

కొన్ని క్షణాలు ఆ ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

సారథి నెమ్మదిగా అన్నాడు "మీరు నన్ను క్షమించినా క్షమించకపోయినా నేనో పెద్ద నేరం చేశాను. మీరు నాకు ఏ శిక్ష విధించినా సంతోషిస్తాను".

"సారథీ! ఏమిటి నువ్వు మాట్లాడేది?"

సారథి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"కృష్ణుడ్ని ... నేను ... నేనే చంపాను".

ఎవరూ ఊహించని సత్యం.

ఎవరూ నమ్మని సత్యం.

ఈ సత్యాన్ని నిర్భయంగా చెబుతున్నాడు సారథి.

ఈ మాట వినటంతోనే పార్వతీశంకు ఎక్కడ లేని కోపం వచ్చింది.

ఆ క్షణంలో సారథిని దారుణంగా చంపాలనుకున్నాడు. తన కుమారుడిని చంపిన ఈ దుర్మార్గుడు బతక్కూడదనుకున్నాడు. పిడికిలి బిగించాడు.

"కృష్ణుడ్ని నేను చంపాలని చంపలేదు. తాటిపట్టీలమీద నడుస్తున్న కృష్ణుడ్ని తోసేస్తే నీటిలో పడతాడు. నీటిలో పడగానే నేను వెళ్ళి కృష్ణుడ్ని రక్షించి ఒడ్డుకు తీసుకొస్తాను. స్వయంగా మీ కొడుకే తాటిపట్టీలమీద నుంచి నీటిలో పడితే మీకు ఎంత బాధ కలుగుతుందో స్వయంగా తెలియజేయటం కోసమే నేనా పని చేశాను. మీలో మార్పు కోసం చేశాను. ఈ చిన్న నాటకం వల్ల గూడెంకు పక్క వంతెన వస్తుందని ఆశించాను. కానీ నీటి ప్రవాహపు వేగానికి కృష్ణుడ్ని రక్షించలేకపోయాను".

పార్వతీశం కొన్ని క్షణాలు మ్రాన్పడిపోయాడు. తన శరీరంలో వున్న కోపమంతా ఆవిరయిపోతున్నట్లుగా నిస్సత్తువగా అయిపోయాడు. సారథికేసి చూశాడు. అతని నిజాయితీని అభినందించకుండా వుండలేకపోయాడు. తన కొడుకు చనిపోవడం కంటే సారథి ధైర్యాన్ని మెచ్చుకున్నాడు. పోయిన కొడుకు ఎలాగూ రాడు. తన అహంకారానికి అంతిమ సంస్కారం చేశాడు. బతికినంతకాలం నలుగురికీ సహాయం చేయడమే ఉత్తమం అనుకున్నాడు.

పార్వతీశం ఏదో నిశ్చయించుకున్నవాడిలా స్థిర స్వరంతో అన్నాడు. "సారథీ! నా అహంకారాన్ని అణచడానికి నువ్వు చేసిన ప్రయత్నం మంచిదే. కాని దురదృష్టం వెంటాడింది. ఇది నువ్వు చెయ్యాలని చేసిన నేరం కాదు. ఇందులో నిన్ను శిక్షించడానికేం లేదు. ఇప్పుడు నేనేమిటో తెలుసుకున్నాను. నా కొడుకు చనిపోయాడనే దుఃఖం కంటే ఒక గొప్ప సత్యాన్ని తెలుసుకున్నందుకు ఆనందపడుతున్నాను. రా వెడదాం! బయట మన కోసం అంతా ఎదురుచూస్తున్నారు. వంతెనకు ప్రారంభోత్సవం చేయడానికి టైమయింది. వంతెనకు మంత్రిగారు కాదు, ప్రారంభోత్సవం చేసేది నువ్వే. రా!!" అంటూ సారథి చేతిని పట్టుకుని బయటకు నడిచాడు పార్వతీశం.

కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా సారథి ఆయన్ను అనుసరించాడు. ❋